నిజాయితీ, విశ్వసనీయతకు పట్టం కట్టండి


50వ డివిజన్ వెంకటేశ్వరకాలనీలో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి


45వ డివిజన్ నాగేంద్రనగర్‌లో ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

● ప్రజలకు బాలినేని శచీదేవి, శ్రీకావ్య పిలుపు

ఒంగోలు: నిజాయితీ, విశ్వసనీయతకు మరోసారి పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, కోడలు శ్రీకావ్య ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక 50వ డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీ, 45వ డివిజన్‌లోని నాగేంద్రనగర్‌లో మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి మాట్లాడుతూ వారి సమస్యలడిగి తెలుసుకుని అభిప్రాయాలు కూడా స్వీకరించారు. నిజం గడపదాటే సరికి అబద్ధం ఊరు దాటుతుందనే సామెత ఉండనే ఉందని, అందువలన వాస్తవాన్ని గమనిస్తూ ముందడుగు వేయాలని ప్రజలను కోరారు. మీ ఇంటికి గత టీడీపీ ప్రభుత్వంలో ఎటువంటి లబ్ధి చేకూరింది, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి లబ్ధి చేకూరిందనేది బేరీజు వేసుకోవాలన్నారు. సంక్షేమమే తప్ప అభివృద్ధి లేదంటూ తప్పుడు ప్రచారం చేసేవారు పెరిగిపోయారని, కానీ.. వాస్తవానికి తాము ఎటువంటి అభివృద్ధి చేశామో స్పష్టంగా గమనించాలని తమ వద్ద ఉన్న అభివృద్ధి పనులతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. తాము నిజాయితీగా పనిచేశామని, ప్రతి ఒక్కరినీ విశ్వసించామని, ప్రతి ఒక్కరినీ ఆత్మ బంధువుల్లాగే భావించామని తెలిపారు. అందుకే కరోనా సమయంలో అండగా నిలిచామని గుర్తుచేశారు. కానీ, ఆనాడు కనుచూపుమేరలో కనిపించని వారు నేడు ఓట్ల కోసం వచ్చి ప్రజలను ప్రలోభపెడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నిజాయితీ, విశ్వసనీయతకు మరోసారి పట్టం కట్టి మరింత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలతో మాట్లాడి వారి రాజకీయ చైతన్యం చూసి శచీదేవి అభినందించారు. మహిళలు ఈ విధంగా చైతన్యవంతమయితేనే ఆ కుటుంబం, సమాజం బాగుపడుతుందని తెలిపారు. అందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యధిక పథకాలు మహిళల పేరుమీదనే అందిస్తున్నారని తెలిపారు. వెంకటేశ్వర కాలనీలో పూరేటి మల్లెం కొండయ్య కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకున్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్, కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, ఆల్డా చైర్‌పర్సన్ కోసూరి రాధ, మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నక్కల లీలాకుమారి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు రవణమ్మ, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, గృహలక్ష్మి, టి.మాధవి, గోను రమేష్, పందీటి శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఓబుల్‌రెడ్డి, కండే రాములు, రవి, అజయ్, అంజలి, జల్లిపల్లి సుబ్బులు పాల్గొన్నారు. 45వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే


ఈతముక్కలలో ఏసుక్రీస్తు శిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఒంగోలు జేఎంబీ చర్చిలో దైవ ప్రసంగం చేస్తున్న పాస్టర్ ఆషెర్‌పాల్


క్రీస్తు సందేశం అందిస్తున్న బేతేల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకురాలు కుమారి బేబిస్టార్

ఒంగోలు రూరల్:

గుడ్ ఫ్రై డేని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఒంగోలు మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతేల్ ప్రార్థనా మందిరంలో కుమారి జి.బేబిస్టార్, పాస్టర్ విక్టర్‌పాల్, రెవ.అవినాష్, రెవ.ప్రభాత్ క్రీస్తు సందేశం వినిపించారు. బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్ ఆర్.ఎం.పి.ప్రభాకర్‌కుమార్ ఒంగోలు నగర శివారులోని నెహ్రూనగరల్‌లో, త్రోవగుంటలోని బైబిల్ మిషన్ చర్చిలో దాసు బాబు, పానకాలపాలెం చర్చిలో ధనరాజ్, చేజర్లలో ఏసురత్నం, దేవరంపాడులో శేఖర్‌బాబు, గుండాయపాలెంలో నతానియేలు, ఉలిచి బాప్టిస్టు చర్చిలో రెవ. శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దశరాజుపల్లె బాప్టిస్టు చర్చిలో, యరజర్ల ప్రార్థనా మందిరంలో, సర్వేరెడ్డిపాలెం, మంగళాద్రిపురంలోని ప్రార్థనా మందిరాల్లో ఏసుక్రీస్తు సిలువపై పలికిన 7 మాటలను ఆయా సంఘ బోధకులు వివరించారు. అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న భక్తులందరికీ ఆయా సంఘ కాపరులు, సంఘ పెద్దలు అల్పాహార విందు, భోజన వసతి కల్పించారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని అన్ని చర్చిల్లో గుడ్ ఫ్రై డే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు సువార్తను పాస్టర్లు వినిపించారు. క్రీస్తు జన్మదినం నుండి ఆయన శిలువ వేయబడినంత వరకూ ఆయన మహిమలను భక్తులకు వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో క్రైస్తవులకు భోజన వసతి కల్పించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రై డే పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు భారీగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు ఆలపించారు. ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈతముక్కల ఎస్సీకాలనీలో ఏసుక్రీస్తు శిలువ మార్గం నిర్వహించారు. ఈతముక్కల చర్చి నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు బస్టాండ్ సెంటర్, బ్యాంక్ బజార్ మీదుగా శిలువ భుజాన పెట్టుకుని శిలువ మార్గం నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ బాలస్వామి, పాస్టర్లు పాల్గొన్నారు.


బైబిల్ మిషన్ చర్చిలో వాక్యం చదువుతున్న రెవ.ప్రభాకర్‌కుమార్


బైబిల్ మిషన్ చర్చిలో క్రీస్తు సందేశం అందిస్తున్న రెవ.అవినాష్


బేతేల్ మినిస్ట్రీస్ చర్చిలో పాల్గొన్న భక్తులు


ఒంగోలు జేఎంబీ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

అక్రమ మద్యం పట్టివేత

అర్థవీడు (కంభం): మద్యం అక్రమంగా కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అనిత తెలిపారు. మండల కేంద్రం అర్థవీడులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అక్రమంగా 19 మద్యం బాటిళ్ల కలిగి ఉండటాన్ని గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకొని మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదిలి: మర్రిపూడి మండలం గుండ్లసముద్రం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు పొదిలి నుంచి 47 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కోటయ్య తెలిపారు. నిందితుడి నుంచి 47 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

యర్రగొండపాలెం: మండలంలోని గుర్రపుశాల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ పి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 200 మద్యం సీసాలు, 12 బీర్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

నేడు బాలినేని ఎన్నికల ప్రచారం ప్రారంభం



ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం ఒంగోలు నగరంలోని 17వ డివిజన్‌లో పెళ్లూరు అంబేడ్కర్‌కాలనీ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన ఒంగోలు – మన వాసన్న పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవులు పొందినవారు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే

వడ్డెర్ల మద్దతు


మాట్లాడుతున్న వడియరాజుల సంఘ నాయకులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని వడ్డెరలు, వడియరాజులంతా వారికి రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే పార్టీకే ఐక్యంగా మద్దతివ్వాలని వడ్డెర సంఘ నాయకులు కోరారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో శుక్రవారం జిల్లా వడ్డెర, వడియరాజుల సంఘ ఒంగోలు నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వడ్డెర సంఘ జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు పాల్గొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో వడ్డెర ఆత్మీయ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో వడియరాజుల సంఘ జిల్లా కన్వీనర్ తన్నీరు నాగేశ్వరరావు, బెల్లంకొండ అశోక్, వల్లెపు మురళి, యనమల మాధవి, వల్లపు శేషు, బండారు మల్లికార్జున్ పాల్గొన్నారు.